క్లుప్తంగా

ఘనంగా గౌరీశంకరుల గ్రామోత్సవం



జగపతినగరంలో గౌరీ శంకరులను ఊరేగిస్తున్న భక్తులు

కిర్లంపూడి: జగపతినగరంలో ఉన్న గౌరీశంకరుల ఆలయ 14వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కర్రి సూర్యప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారి ప్రతిమలను వాహనంపై ఆశీలు చేసి వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ స్వామి, అమ్మవార్లను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారంలో డిగ్రీ కళాశాల సిబ్బంది



ఏలేశ్వరంలో ఇంటింటా కరపత్రాలు పంచుతున్న ప్రిన్సిపాల్ సునీత, సిబ్బంది

ఏలేశ్వరం: కార్పొరేట్ కళాశాలలకు దీటుగా తమ కళాశాలలో చదువు, అన్ని సదుపాయాలు అందిస్తున్నామంటూ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిబ్బంది పట్టణంలో మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.సునీత ఆధ్వర్యంలో స్థానిక వైఆర్పీ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తమ కళాశాలలో విద్యను అందిస్తామన్నారు. కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రయాగమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంగీతంపై మక్కువ పెంచుకోవాలి



ఏలేశ్వరం గ్రంథాలయంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న సీతారామయ్య

ఏలేశ్వరం: విద్యార్థులు సంగీతంపై మక్కువ పెంచుకోవాలని రేడియో సినిమా టీవీ ఆర్టిస్ట్ చక్రవర్తుల సీతారామయ్య అన్నారు. గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు దేశభక్తి గీతాలు, సంగీతంపై శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశభక్తి గీతాలు, సంగీతంపై విద్యార్థులు పట్టుసాధించాలన్నారు. దేశాన్ని ప్రేమించాలి, క్రమశిక్షణతో మెలగాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో అన్నదానం



ఏలేశ్వరం స్వామి వారి ఆలయంలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

ఏలేశ్వరం: అనంతలక్ష్మీ సమేత సత్యనారాయణస్వామి వారి పాంచాహ్నిక వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా పట్టణంలో మంగళవారం అన్నదానం నిర్వహించారు. స్థానిక పల్లపువీధిలోని స్వామి వారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదానానికి పట్టణంలోని పలు ప్రాంతాలకు చెందిన సుమారు వెయ్యి మంది వచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. విశ్వహిందూ పరిషత్ అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని మహిళా సంఘాలు తమ సేవలు అందించారు. అర్చకుడు పాస్నూరు సత్యనారాయణచార్యులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. మహిళా సంఘాల సభ్యులు మండ సూర్యకుమారి, సీతామహలక్ష్మి, వెల్లంపల్లి రమ, మంగామణి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పోలవరం త్వరగా పూర్తి చేయాలి

జగ్గంపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం రూ.12 వేల కోట్లు విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేశారు.

ఇండస్ట్రియల్ పార్క్‌పై ప్రజాభిప్రాయ సేకరణ

- కలెక్టర్ కృతికా శుక్లా, అధికారుల ఆధ్వర్యంలో ప్రక్రియ పూర్తి
- ప్రజల డిమాండ్లను అంగీకరించిన కాకినాడ సెజ్ డైరెక్టర్ రామిరెడ్డి



అభిప్రాయ సేకరణలో పాల్గొన్న ప్రజలు

తొండంగి: కాకినాడ స్పెషల్ ఎకనామిక్ జోన్(కేఎస్ఈజెడ్)లో ఏర్పాటు చేయనున్న మల్టీ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ ఇండస్ట్రియల్ పార్క్‌పై ప్రభుత్వం మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. ఇందులో ప్రాజెక్టు పరిధిలోని గ్రామాల్లో వెయ్యి మందికి పైగా ప్రజలు పాల్గొన్నారు. వారి అభిప్రాయాలను కలెక్టర్ కృతికా శుక్లా, కాలుష్య నియంత్రణ మండలి ఇంజినీర్ ఎస్.అశోక్‌కుమార్‌కు తెలియజేశారు. ప్రజల సందేహాలను నివృత్తి చేయాలని కేఎస్ఈజెడ్ ప్రతినిధులను కోరారు. కాలుష్య నియంత్రణ, గ్రీన్‌బెల్ట్ ఏర్పాటు, సామాజికాభివృద్ధి, విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పన, యువతకు సెంట్రలైజ్డ్ మల్టీపర్పస్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ద్వారా శిక్షణ, ఉపాధి కల్పన వంటి వాటికి కృషి చేస్తామని కేఎస్ఈజెడ్ డైరెక్టర్ ఒ.రామిరెడ్డి హామీ ఇచ్చారు. కాకినాడ సెజ్ పేరును కోన సెజ్‌గా మార్చాలనే డిమాండ్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదించి, మార్పునకు ప్రయత్నిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు, కాకినాడ సెజ్ ప్రతినిధి (పర్యావరణం) ఎంఎన్‌కే శ్రీనివాస్, పర్యావరణ కన్సల్టెంట్ జీవీ రెడ్డి, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, పెరుమాళ్లపురం సర్పంచ్ యాదాల ఉమా రేవతి, ఎంపీటీసీలు, ఇతర గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి



కేఎస్ఈజెడ్‌కు గతంలో రైతులంతా భూములిచ్చారు. చాలా మంది రైతులు భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. వారందరికీ సెజ్ యాజమాన్యం న్యాయం చేసి ఆర్థిక సహాయం అందించాలి.

– కె.అమ్మాజీ, సర్పంచ్, రమణక్కపేట

గ్రామాలను దత్తత తీసుకోవాలి



కేఎస్ఈజెడ్‌కు భూములిచ్చిన రైతుల గ్రామాలను యాజమాన్యం దత్తత తీసుకుని మౌలిక వసతుల కల్పన, వైద్య, విద్య సౌకర్యాలను కల్పించాలి. ఈప్రాంత ప్రజలకు ఉచిత విద్యుత్, వడ్డీలేని రుణాలను ఇవ్వాలి. ప్రజల అభివృద్ధికి కృషి చేయాలి.

– జేటీ రామరావు, ఏపీ ప్రజాసంఘాల జేఏసీ ప్రెసిడెంట్, రాజమండ్రి

భూ త్యాగాలను గుర్తించి..



తీరప్రాంత అభివృద్ధికి రైతులు 10,500 ఎకరాలను ఇచ్చారు. వీరికి ప్రాధాన్యత ఇచ్చి కాకినాడ సెజ్ కాకుండా కోన సెజ్, కోన గేట్ వేగా పేర్లు మార్చాలి. రైతు కుటుంబాలకు అదనంగా పరిహారం ఇచ్చి, వారికి చెందిన యువతకు పర్మినెంట్ ఉద్యోగాలను ఇవ్వాలి.

– డి.వి.ప్రసాద్‌రెడ్డి, కాకినాడ సెజ్ ఫార్మర్స్ ప్రొటెక్షన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు, నాగులాపల్లి

యువత క్రీడల్లో రాణించాలి

- తుని మార్కెట్ కమిటీ ఛైర్మన్ మాకినీడి బాబు
- ఉత్సాహంగా డీఆర్ఎఫ్ క్రికెట్ టోర్నీ



తొలి మ్యాచ్‌ను ప్రారంభించి బ్యాటింగ్ చేస్తున్న బాబు

తుని: యువతలో క్రీడల్లో రాణించాలని తుని మార్కెట్ కమిటీ ఛైర్మన్ మాకినీడి బాబు అన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకొని మంగళవారం స్థానిక రాజా కళాశాల మైదానంలో దాడిశెట్టి రాజా ఫాలోవర్స్(డీఆర్ఎఫ్) క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వక్ఫ్ బోర్డు వైస్ ఛైర్మన్ షేక్ ఖ్వాజా అధ్యక్షత వహించారు. ముందుగా దివంగత నేత రాజశేఖరరెడ్డి విగ్రహానికి వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, ఎంపీపీలు బొప్పన రాము, లగుడు శ్రీను, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కుసుమంచి సుబ్బరాయుడు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బాలు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు క్రీడలను పట్టించుకోలేదని, ప్రస్తుత ప్రభుత్వ తుని నియోజకవర్గ శాసనసభ్యుడు, మంత్రి దాడిశెట్టి రాజా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. క్రికెట్‌కు అనుకూలంగా ఉండే పిచ్చును తయారు చేయించి, నియోజకవర్గ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహిస్తూ ఏటా టోర్నీలు నిర్వహిస్తున్న మంత్రి రాజాకు అందరు రుణపడి ఉన్నామన్నారు. ఇలాంటి టోర్నమెంట్ ద్వారా ప్రతిభ చూపి జిల్లా, రాష్ట్ర స్థాయిలో తునికి మంచి పేరుతీసుకురావాలని ఏఎంసీ ఛైర్మన్ మాకినీడి బాబు అన్నారు. డీఆర్ఎఫ్ టోర్నీ కోసం డిజిటల్ స్కోర్ బోర్డు అందుబాటులోకి తీసుకువచ్చామని, విశాఖపట్నం నుంచి అంపైర్లను ఏర్పాటు చేశామన్నారు. తొలి మ్యాచ్ ఎస్‌కేటీ వర్సెస్ సూరవరం జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన సూరవరం జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. ఎంపీపీ లగుడు శ్రీను బౌలింగ్ చేయగా బాలు బ్యాటింగ్ చేశారు. వైఎస్సార్ జయంతి రోజున ముగింపు వేడుకలకు మంత్రి రాజా హాజరవుతారని చెప్పారు. డీఆర్ఎఫ్ టోర్నీలో పాల్గొనే అన్ని జట్లకు నాణమైన క్రికెట్ కిట్లను అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. లోవ దేవస్థానం ఛైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, తుని మండల పార్టీ అధ్యక్షుడు పోతల రమణ, గొర్లి రామచంద్రరావు, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడు బోడపాటి శ్రీను, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పోతుల లక్ష్మణ్, చింతకాయల చినబాబు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, అభిమానులు పాల్గొన్నారు.

పాఠశాలల ప్రారంభానికి పనులు పూర్తి చేయాలి

కలెక్టర్ కృతికాశుక్లా



రావికంపాడు జెడ్పీ హైస్కూల్లో నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

తొండంగి: వేసవి సెలవుల అనంతరం పాఠశాలల ప్రారంభానికి ముందే ప్రభుత్వం పాఠశాలల్లో నిర్వహిస్తున్న నాడు-నేడు పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని రావికంపాడులో జెడ్పీ హైస్కూల్లో నాడు-నేడు పనులను పరిశీలించారు. విద్యుత్, మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీరు, మేజర్, మైనర్ పనులకు సంబంధించిన వివరాలను హెచ్ఎం సత్తిబాబును అడిగి తెలుసుకున్నారు. అన్ని పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని అవసరమైతే ఏసీఆర్ (అదనపు తరగతి గదుల) నిధులను వినియోగించాలన్నారు. కలెక్టర్ వెంట ఎంపీడీఓ పసపులేటి సతీష్, ఎంఈవో షేక్ బాబ్జి, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

వలంటీర్ల సేవలు మరువలేనివి



రౌతులపూడిలో వలంటీర్లను సత్కరిస్తున్న మార్కెట్‌యార్డు ఛైర్‌పర్సన్ నారాయణమ్మ

రౌతులపూడి: ప్రజల ముంగిటకు ప్రభుత్వ పథకాలు అందిస్తున్న గ్రామ వలంటీర్లు సేవలు మరువలేనివని ప్రత్తిపాడు మార్కెట్‌యార్డ్ ఛైర్‌పర్సన్ జిగిరెడ్డి రమణమ్మ అన్నారు. 'వలంటీర్లకు వందనం' కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన రౌతులపూడిలో సచివాలయం-1, సచివాలయం-2 పరిధిలో పని చేసే గ్రామ వలంటీర్లకు మంగళవారం సత్కార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె స్థానిక నేతలు మండల వ్యవసాయ సలహా కమిటీ ఛైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, సర్పంచ్ కటారి అర్జునమ్మ, డీసీసీబీ డైరెక్టర్ పులి మదు, పార్టీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీనుతో కలసి ఆమె వలంటీర్లకు శాలువాలు కప్పి పూలమాలలు, ప్రశంసాపత్రాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కైసర్ల సత్యనారాయణమూర్తి, పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బియ్యం తరుగుపై డీలర్ల ఆవేదన



తుని తహసీల్దార్ కార్యాలయంలో ఎంఎస్ఓకు వినతిపత్రం అందజేస్తున్న డీలర్లు

తుని: తుని మండలం రేఖవానిపాలెం ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి సరఫరా చేస్తున్న పీడీఎస్ బియ్యంలో తరుగు వస్తుందని రాష్ట్ర డీలర్ల అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పోలిశెట్టి శివ కేశవరావు అన్నారు. మంగళవారం తుని, తొండంగి, కోటనందూరు, రౌతులపూడి మండలాలకు చెందిన డీలర్లు ఎంఎల్ఎస్ పాయింట్ దగ్గర ఆందోళన వ్యక్తం చేసి ఎంఎస్ఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివ కేశవరావు మాట్లాడుతూ గొడౌన్‌లో 3.5 మెట్రిక్ టన్నుల కాటా ఉన్నా తూకం వేయమంటే సిబ్బంది పట్టించుకోవడం లేదని, రెండు, మూడు సార్లు తిప్పించుకుంటున్నారన్నారు. సరుకు ఎలాట్ మెంట్‌లో 100 నుంచి 150 కిలోల తరుగు వస్తుందన్నారు. నిబంధనల ప్రకారం తరుగు బియ్యాన్ని కలిపి ఇవ్వాలన్నారు. దీనిపై సంబంధిత అధికారులను అడిగినా స్పందించడం లేదని ఆరోపించారు. డీలర్లకు జరుగుతున్న అన్యాయంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాలుగు మండలాలకు చెందిన రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మహిళల మెప్మా బజారు



తునిలో మెప్మా బజారును పరిశీలిస్తున్న సీపీ సుధారాణి

తుని: పట్టణ పరిధిలోని మహిళా సంఘాలు మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బజారు అందరిని ఆకట్టుకుంది. మంగళవారం మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో మహిళా సంఘాలు తయారు చేసిన పలు రకాల వస్తువుల మేళాను మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి ప్రారంభించారు. పలు స్టాల్స్‌లో పదర్శించిన వస్తువులను ఆమె పరిశీలించారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులు నాణ్యతతో ఉన్నాయని, ప్రజలకు అవసరమైన వస్తువులను తయారు చేయాలని ఆమె సూచించారు. పట్టణంలో మెప్మా బజారును ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ ఛైర్మన్ షేక్ ఖ్వాజా, కమిషనర్ ప్రసాదరాజు, మెప్మా అధికారి శ్రీదేవి, కౌన్సిలర్లు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

తుని: ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని రాష్ట్ర ఉద్యోగుల సంఘం చేపట్టిన దీక్షకు మద్దతుగా తునిలో రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. మంగళవారం తుని తహసీల్దార్ కార్యాలయం ఎదుట జీఎన్‌టీ రోడ్డులో ఏర్పాటు చేసిన శిబిరానికి జిల్లా అధ్యక్షుడు జగన్నాథం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వం ఇటీవల ఉద్యోగ సంఘాలతో జరిపిన చర్చల్లో కొన్నింటిని పరిష్కరించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా పరిష్కరించాల్సిన అంశాలతో పాటు ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేయాలని కోరారు. తుని తాలూకా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీను, మూడు మండలాలు, పట్టణానికి చెందిన పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

కిర్లంపూడిలో శాంతి ర్యాలీ



మౌనం పాటిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కిర్లంపూడి: ఒడిశాలో గత శుక్రవారం జరిగిన రైలు ప్రమాదంలో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుతూ మంగళవారం ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పెంటకోట నాగబాబు, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ ఒడిశాలోని బాలేశ్వర్ జిల్లాలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో వందల సంఖ్యలో మరణించగా, వెయ్యి మందికి పైగా గాయాలపాలయ్యారన్నారు. తొలిత పది నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో మద్దాల రాంబాబు, సంఘన వెంకటేశ్వరావు, దాడి అప్పలరాజు, బిల్లకుర్తి శివాజీ, దాడి పెద్దబుజ్జి, మళ్ళ నాగు, యల్లపు నానాజీ, మూరా చంటిబాబు, బంగారు రమణ తదితరులు ఉన్నారు.

రెజ్లర్లకు మద్దతుగా లాయర్ల ర్యాలీ



ఎంపీని తక్షణం అరెస్టు చేయాలని ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

అన్నవరం: మహిళా రెజ్లర్లకు మద్దతుగా ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ సభ్యులు ర్యాలీ నిర్వహించారు. మంగళవారం సాయంత్రం స్థానిక రావిచెట్టు సెంటర్ వద్ద ఉన్న రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించి బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ చరణ్ సింగ్‌పై పోక్సో కేసు నమోదు చేయాలని, అతనిని అరెస్టు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఈ నెల 25న విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నామని, దానికి ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి క్లిప్టన్ హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు బుగతా శివ, రాజాల చిట్టిబాబు, బండారు నర్సింహరావు, ఏకేవీ మల్లేశ్వరరావు, యడ్ల శ్రీనివాస్, ఛామర్తి వేంకట రమణమూర్తి, అవసరాల దేవి, సృజన, శివకోటి గంగాభవాని, సరమర్ల మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

మాసోత్సవాలను సమర్థవంతంగా నిర్వహిద్దాం

గండేపల్లి: మలేరియా మాసోత్సవాన్ని సమర్థవంతంగా నిర్వహిద్దామని గండేపల్లి వైద్యాధికారి ఐ.సౌమ్య అన్నారు. మలేరియా మాసోత్సవాలు సందర్భంగా స్థానిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందికి మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 30 వరకూ ఈ మాసోత్సవాలు జరుగుతాయని, గ్రామాల్లో సర్వే నిర్వహించి జ్వరాల బారిన పడిన వారి సమాచారం తక్షణమే తెలియజేయాలని, అలాగే డ్రై డే కార్యక్రమం నిర్వహించడం, తదితర వాటిపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు మలేరియా వ్యాధిపై వ్యాసరచన పోటీలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ శర్మ, సిబ్బంది జీవన్, రూతమ్మ, హెలినా, హెచ్ఎస్ చల్లారావు, ఎంఎల్‌హెచ్‌పి లు, ఆశాలు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న తహసీల్దార్

గండేపల్లి: గ్రామంలో 15 రోజులుగా నిర్వహిస్తున్న నాళం హేమంత్‌కుమార్ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారంతో ముగిసింది. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో 32 జట్లు పాల్గొనగా ప్రథమ బహుమతి దివాన్ చెరువు, ద్వితీయ బహుమతి జగ్గంపేట జట్టు దక్కించుకున్నట్టు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు తహసీల్దార్ వీవీ సత్యనారాయణ, చిటికెల కన్నబాబు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. గ్రామస్తులు తదితరుల సహాయ సహకారాలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాళం వీరబాబు, వాసిరెడ్డి రాంబాబు, గారపాటి గంగాధర్, యాక పరదేశనాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లండి



కార్యకర్తల సమావేశంలో పలు అంశాలపై చర్చిస్తున్న నాయకులు

తుని: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల సూర్యనారాయణరాజు నాయకులకు సూచించారు. మంగళవారం తునిలో బీజేపీ పార్టీ కార్యాలయంలో తుని నియోజకవర్గ కన్వీనర్ వెలుగుల గోపాలకృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సూర్యనారాయణరాజు మాట్లాడుతూ రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పార్టీ బలోపేతం అందరూ కృషి చేయాలన్నారు. పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. కేంద్రం చేస్తున్న మంచిని గుర్తించేలా ప్రచారం చేయాలన్నారు. తుని, కోటనందూరు, తొండంగి మండలాల పార్టీ అధ్యక్షులు ప్రగడ అర్ధనారీశ్వరరావు, లాలం లోవరాజు, యాదాల రమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆకెళ్ల శాస్త్రి, తుని పట్టణశాఖ కార్యదర్శి కాదంబర రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



ప్రత్తిపాడులో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్

ప్రత్తిపాడు రూరల్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన ప్రత్తిపాడులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన స్థానిక పార్టీ నాయకులతో కలిసి నిర్వహించారు. ఎమ్మెల్యే గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో పేదలకు అన్ని విధాల మేలు చేకూరిందన్నారు. అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

గోకవరం: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిరా రాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుమ్మళ్లదొడ్డి-1లో బీసీ-ఈ, గంగంపాలెం-1లో ఓసీ జనరల్, జగన్నాథపురంలో బీసీ-ఎ, బావాజీపేటలో ఓసీ జనరల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 13 నాటికి కోరుకొండ సీడీపీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు.

12న మెగా సీడ్ మేళా

ప్రత్తిపాడు రూరల్: రైతు కోసం నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యంగా ఈ నెల 12వ తేదీన ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విత్తన మహోత్సవం (మెగా సీడ్ మేళ) ఘనంగా నిర్వహించనున్నట్టు మండల వ్యవసాయ అధికారి వై.గంగాధర్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటనతో తెలిపారు. రానున్న తొలకరిలో పంటల సాగుకు సన్నద్ధమవుతున్న రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నట్టు తెలియజేశారు. ఈ విత్తన మహోత్సవంలో మన రాష్ట్రంలో సాగు చేస్తున్న ప్రధాన పంటలైన వరి, కంది, మినుము, పెసర, సెనగ, వేరుశనగ, నువ్వులు, రాగి, కొర్ర, జొన్నలలో కొత్త వంగడాల విత్తనాలు విక్రయించనున్నారు. మామిడి, జీడిమామిడి అంట్లు, అడవి బాదం, పండ్ల మొక్కలైన నిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, బొప్పాయి మొదలగు మేలైన నారుమొక్కలు విక్రయానికి అందుబాటులో ఉంటాయని తెలియజేశారు.

అందుబాటులో వరి విత్తనాలు

గోకవరం: స్థానిక విశాల సహకార పరపతి సంఘంలో రైతులకు ఖరీఫ్‌లో సాగుకు అవసరమయ్యే వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సంఘం ఛైర్మన్ గాజింగం సత్తిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1061, 1064, పీఎల్ఏ, బీపీటీ సాంబ రకం వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. 1061, 1064, పీఎల్ఏ రకం విత్తనాలు 30 కేజీలు రూ.1100, బీపీటీ సాంబ రూ.930 అందుబాటులో ఉన్నాయన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు సంఘంలో సంప్రదించాలన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రత్తిపాడు రూరల్: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు వైద్య పరీక్షల కోసం వచ్చిన 65 మంది గర్భిణులకు స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. రాచపల్లికి చెందిన పాలకపాటి సూర్యనారాయణరాజు, సీతమ్మల జ్ఞాపకార్థంగా పౌష్టికాహారాన్ని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గుడాల వెంకటరత్నం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ ఆర్ఎంఓ డాక్టర్ న్యాకుమారి, లయన్స్ క్లబ్ కార్యదర్శి సాంబశివరావు, పాస్ట్ డిస్టిక్ గవర్నర్ రాజు రమేష్, రెడ్డి నాయుడు, సంజీవరావు, ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ ఇంజినీర్ మోహన్, డేవిడ్ రాజు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఘర్షణలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ఏలేశ్వరం: షాపుల విషయమై జరిగిన వివాదంలో వ్యక్తి తీవ్రంగా సంఘటన పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు సి.రాయవరం గ్రామానికి చెందిన అన్నదమ్ములు కేశవరపు వెంకటేశ్వరరావు, రాజబాబు, సూరిబాబు, బాబ్జిలకు ఏలేశ్వరంలోని నర్సీపట్నం రోడ్డులో నాలుగు షాపులు ఉన్నాయి. షాపుల పంపకంపై గత కొంత కాలంగా వీరి మధ్య వివాదం నెలకొంది. దీని నిమిత్తం పెద్దల సమక్షంలో నలుగురు అన్నదమ్ములు పంచాయతీ పెట్టుకున్నారు. అది కాస్త ఘర్షణకు దారితీసింది. ఈ ఘర్షణలో వెంకటేశ్వరరావు కుమారుడు ప్రసాద్ మరో సోదరుడు రాజబాబు ఛాతిపై చాకుతో పొడిచాడు. తీవ్రంగా గాయపడిన రాజబాబును స్థానిక ప్రభుత్వ ఆసుత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సారాతో మహిళ అరెస్టు

ప్రత్తిపాడు రూరల్: స్థానిక ఎస్ఈబీ స్టేషన్ పరిధి నిర్వహించిన దాడుల్లో ఐదు లీటర్ల సారాతో మహిళను అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. ఏలేశ్వరం మండలం రమణయ్యపేటలో సారా విక్రయిస్తున్న గ్రామానికి చెందిన తెంకే కృష్ణ కుమారిని ఐదు లీటర్ల సారాతో అదుపులోకి తీసుకున్నారు. సీఐ అశోక్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ ఎస్సై బి.శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్ వెంకన్న దొర, సిబ్బంది పాల్గొన్నారు.

గాయపరిచిన వ్యక్తిపై కేసు

కిర్లంపూడి: రాడ్డుతో కొట్టి గాయపరిచిన వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్టు ఏఎస్సై కె.రామకృష్ణమూర్తి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వేలంక గ్రామానికి చెందిన చేదులూరి రాంబాబు(వికలాంగుడు)ను అదే గ్రామానికి చెందిన శెట్టి అప్పారావు(బుజ్జి)తల్లి మూగజీవులను వంకతో దుర్భాషలాడుతుంది. ఎందుకు అలా తిడుతున్నావంటూ రాంబాబు గొడవ పడ్డాడు. తన తల్లితో గొడవ పడతావా అంటూ అప్పారావు ఇంట్లో ఉన్న రాడ్డు తీసుకొచ్చి రాంబాబు తలపై బలంగా కొట్టడంతో తీవ్ర గాయమై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై రామకృష్ణమూర్తి తెలిపారు.